నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 6 మార్చి 2024 | KAMAREDDY

ఎల్ ఆర్ఎస్‌పై పోరుబాటకు తరలిరావాలి

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
నేడు బాల్కొండ బస్టాండ్ ఎదుట ధర్నా

వేల్పూర్, మార్చి 5: ఎల్ఆర్ఎస్ ద్వారా రాష్ట్రంలోని 25లక్షల మందిపై సుమారు రూ.20 వేల కోట్ల ఆర్థిక భారాన్ని మోపేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాల్కొండ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉదయం 10గంటలకు ధర్నా మొదలవుతుందని, నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

అడుగంటిన ఆశలు..

నీటి తడి అందక ఎండిన పంట
చేతికొచ్చిన పంట ఎండిపోవడంతో బోరుమంటున్న రైతన్న

ఎన్నో ఆశలతో దుక్కి దున్ని నారు పోసి యాసంగి పంట వేశారు. పంట ఏపుగా పెరిగింది. దీంతో రైతులు మురిసిపోయారు. రెండు, మూడు తడులు అందిస్తే పంట చేతికందుతుందని సంతోషపడ్డారు. ఆ సంతోషం మూన్నాళ్లు కూడా మిగల లేదు. భూగర్భ జలాలు అడుగంటి పోయి ఉన్న బోరు నుంచి నీటి చుక్క కూడా రాలేదు. దీంతో వేసిన పంట ఎండిపోయింది. రైతుకు గోడును మిగిల్చింది.

- ధర్పల్లి, మార్చి 5

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని ఇందిరానగర్ తండా పంచాయతీ పరిధికి చెందిన కడావత్ పరశురాం అనే రైతు తన కున్న మూడున్నర ఎకరాల్లో వరి పంటను వేశాడు. వరి గింజ కట్టే దశలో నీటి తడులు అందక బోర్లలో పూర్తిగా నీరు ఇంకిపోయి ఎండిపోవడంతో తీవ్ర ఆవేదన చెందాడు. చివరికి ఇతర రైతుల ఇంటి వద్ద ఉన్న బోరునీటిని అడిగి తీసుకొని అర ఎకరం నుంచి ఎకరం వరకు కాపాడుకునే ప్రయత్నాలు చేశాడు. మిగతా రెండున్నర ఎకరాల పంట మొత్తం ఎండిపోయింది. చేసిందేమీ లేక గుండెలు బాదుకుంటున్నాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ఏడుపు తప్ప ఏమీ మిగలలేదు

నాకున్న మూడున్నర ఎకరాల్లో వరి వేశా. పంట మొత్తం మంచిగానే పండింది. చాలా ఆనందం అనిపించింది. గొలక వేసింది. రెండు, మూడు తడులు అందిస్తే పంట చేతికందేది. రిగ్గు మోటార్లలో చుక్క నీరు కూడా రాకపోవడంతో ఉన్న పొలం ఎండిపోయింది. గొలకేసిన ఆనందం మిగలకుండా మాకు గోడును మిగిల్చింది. మా తండా వాళ్లను కాళ్లు మొక్కి నీళ్లు అడిగితే ఒక రెండు మడులకు నీరిచ్చారు. సుమారు అర ఎకరంలోపు పంట బతికింది. మిగతా పంట మొత్తం ఎండుకపోయింది. ప్రభుత్వమే మా గోస చూసి ఆదుకోవాలి.

- కడావత్ పరశురాం, రైతు, ఇందిరానగర్ తండా

ఉన్నదంతా ఎండిపోయింది..

నాకు నాలుగు ఎకరాల భూమి ఉన్నది. పానీ అందుతుందో లేదోనని యాసంగిలో రెండు ఎకరాల అరి పంట ఏసినం. ఆ పంట్టైనా చేతికందుతుందేమోననుకుంటే ఏసిన కాడికి ఉన్నదంతా ఎండిపోయింది. పంటను చూస్తే ఏడ్పువస్తున్నది. ఒక్క రూపాయి కూడా రాకుండా పోయింది. ఇవ్వారకు ఎవరూ రాలే. ఇప్పుడైనా గవర్నమెంటోళ్లు మమ్మల్ని ఆదుకోవాలని మొక్కుతున్నా.

- పాతులోత్ భుక్య మరోని, మహిళారైతు, ఇందిరానగర్ తండా



ధర్పల్లి మండలం ఇందిరానగర్ తండాలో నీరు లేక ఎండిపోయిన వరి

ఎండిన వరిని పరిశీలించిన అధికారులు

కోటగిరి, మార్చి 5: 'ఎండుతున్న పైరు.. రైతుల కన్నీరు' అని నమస్తే తెలంగాణ దినపత్రికలో మంగళవారం వచ్చిన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక, ఉన్న బోరు నీరు సరిపోక ఎండిపోతున్న వరి పంటలను మంగళవారం ఉదయం బాధిత రైతులకు కలిసి పరిశీలించారు. భూగర్భ జలాలు పడిపోవడంతో బోరు నీరు లేక పక్క రైతు బోరు నుంచి తాత్కాలికంగా నీటిని తీసుకొని ఎండిపోతున్న వరికి పెడుతున్నారని కోటగిరి మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. కాలువ ద్వారా రెండు దఫాలుగా చివరివరకు సాగు నీరు అందక పంట ఎండిందని, ప్రస్తుతం తడి పెట్టడంతో కొంత సమస్య పరిష్కారమైందన్నారు.

జైనాపూర్ శివారులో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత ఫైర్

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే.. విద్యార్థి మృతి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి తెలంగాణలో చావులే..

కామారెడ్డి, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే బోధన్ హాస్టల్‌లో విద్యార్థి వెంకట్ హత్య జరిగిందని, మరో ఏడుగురు విద్యార్థులపై హత్యకేసు నమోదైందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. హాస్టల్‌లో వార్డెన్, వాచ్‌మన్ లేకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని, సీఎం రేవంత్ రెడ్డి అసమర్థత, పట్టింపులేని చర్యలతోనే ఈ ఘటన జరిగిందని అన్నారు. పొందుర్తి ఆవరణలోని ఓ ఫాంహౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు తెలంగాణలో ఐదుగురు విద్యార్థుల చావులు చూశానని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థుల చావులు చూశామంటే, మళ్లీ ఈ మూడు నెలల్లోనే చూస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్‌పై ఏడ్వడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమాజానికి చేసింది ఏమీలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు విద్యాశాఖకు మంత్రి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. విద్యాశాఖను సీఎం తనవద్దే ఉంచుకున్నాడని, దీనిపై త్వరలో రివ్యూ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో హాస్టళ్ల వద్ద పోలీసులను నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. మృతి చెందిన విద్యార్థి తల్లికి పింఛన్, సోదరుడికి ఉద్యోగం, రూ.15లక్షల నష్టపరిహారం, ఒక డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బయటపడిన రేవంత్‌రెడ్డి నిజ స్వరూపం..

బీఆర్ఎస్, బీజేపీలు ఒకటే అని అన్న రేవంత్ రెడ్డి మొన్నటి సభలో మోదీ పెద్దన్న అనడంతో నిజస్వరూపం బయటపడిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మూమ్మాటికీ ఒక్కటేనని, ప్రాంతీ య పార్టీలు ఉండొద్దనేది రెండు పార్టీల లక్ష్యమని అన్నారు. రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న వ్యక్తి కాబట్టే మోదీని పెద్దన్న అన్నాడని పేర్కొన్నారు. తెలంగాణకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకపోయినా ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. సీఎంకు పబ్లిసిటీ మీద ఉన్న ధ్యాస ప్రజల సమస్యల మీద లేదని అన్నారు. భువనగిరిలో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలు నిరసన తెలిపితే వారిని అరెస్టు చేస్తారా? మార్పు అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చిన నియామకాలను రేవంత్‌రెడ్డి ఇచ్చినట్లుగా గొప్పలు చెబుతున్నారని అన్నారు. నో ఎల్ఆర్ఎస్, నో కాంగ్రెస్ అనే నినాదాంతో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు, ఎంజీ వేణుగోపాల్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్సీ కవిత

గాంధారి, మార్చి 5: బోధన్ పట్టణంలోని బీసీ హాస్టల్‌లో హత్యకుగురైన గాంధారి మండలం తిప్పారం తండాకు చెందిన డిగ్రీ విద్యార్థి హరియాల వెంకట్ కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్‌తో కలిసి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి, న్యాయం జరిగేలా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, గాంధారి జడ్పీటీసీ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు తానాజీరావు, మమ్మాయి సంజీవ్ తదితరులు ఉన్నారు.

పరీక్షలపై పట్టింపేది?

ఖలీల్‌వాడి, మార్చి 5: ఇంటర్ పరీక్షల నిర్వహణలో అధికార యంత్రాంగం వైఫల్యం కనిపిస్తున్నది. కొన్ని సెంటర్లలో జోరుగా మాస్ కాపీయింగ్ సాగుతున్నదని ప్రచారం జరుగుతున్నది. ప్రైవేట్ కళాశాలల నుంచి డబ్బులు తీసుకున్న కొందరు అధికారులు కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వాహకులు.. కొందరు ఇన్విజిలేటర్లు, సూపరింటెండెంట్లను మచ్చిక చేసుకున్నారు. అధికారులకు డబ్బులు ఇవ్వడంతో కాపీయింగ్ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నేతలు చెబుతున్నారు. ఫలితంగానే ఎగ్జామ్ సెంటర్లలోని కిటికీలతో పాటు పరిసర ప్రాంతాల్లో చిట్టీలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద జవాబులతో కూడిన జిరాక్స్ పత్రాలు లభ్యం కావడం చర్చనీయాంశమైంది. మరోవైపు, పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని ప్రకటించిన అధికారులు.. ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. మాస్ కాపీయింగ్ జరుగకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు పెంచాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. మరోవైపు, కాపీయింగ్ జరుగుతుందన్న ప్రచారాన్ని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈవో) రఘురాజ్ ఖండించారు. మాస్ కాపీయింగ్ ఎక్కడా జరగడం లేదని చెప్పారు. ఓ సెంటర్ బయట జిరాక్స్ పేపర్లు లభ్యమైన అంశాన్ని ఆయన వద్ద ప్రస్తావిస్తే.. ఎవరైనా విద్యార్థులు తీసుకొచ్చి బయట పడేశారమో కానీ, హాల్‌లోనికి మాత్రం తీసుకురాలేదని బదులిచ్చారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, వదంతులను నమ్మొద్దని సూచించారు.

ఒకరిపై మాల్ ప్రాక్టీస్ కేసు..

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, మార్చి 5: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఒకరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని హరిచరణ్ జూనియర్ కళాశాలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా విద్యార్థిని ఫ్లయింగ్ స్క్వాడ్ మంగళవారం పట్టుకొని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. జిల్లాలో మొత్తం 17,082 మంది విద్యార్థులకు 16,572 మంది హాజరయ్యారని, 510 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. కామారెడ్డిలో జనరల్ విద్యార్థులు 7607 మందికి 7399 మంది, వొకేషనల్‌లో 1047 మందికి 1021 మంది హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. మొత్తం 234 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సీఎంసీని సిద్ధం చేయాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సీఎంసీలోని గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ

కంఠేశ్వర్, మార్చి 5: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం డిచ్‌పల్లిలోని సీఎంసీని అన్నివిధాలా సిద్ధం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. సీపీ కల్మేశ్వర్ సింగెనవార్, అదనపు కలెక్టర్లతో కలిసి సీఎంసీని మంగళవారం సందర్శించారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌ల కోసం అందుబాటులో ఉన్న గదులను పరిశీలించారు. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును సీఎంసీలోనే చేపట్టినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సీఎంసీ భవన సముదాయంలోని గదులను శుభ్రం చేయించి కౌంటింగ్ స్ట్రాంగ్ రూమ్‌ల కోసం సిద్ధం చేయాలన్నారు. ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ పనులను తక్షణమే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు బాధ్యతలు పురమాయించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, నిజామాబాద్, ఆర్మూర్, జగిత్యాల ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, మధుసూదన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ హన్మంతు రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, అటవీశాఖ అధికారి మురళీ మనోహర్‌రెడ్డి ఉన్నారు.

మొబైల్ షాప్‌లో చోరీ

రూ.2లక్షల విలువజేసే ఫోన్లు అపహరణ
సీపీ క్యాంప్ ఆఫీసుకు కూతవేటు దూరంలోనే ఘటన
సీరియస్‌గా తీసుకున్న పోలీసులు

వినాయక్‌నగర్, మార్చి 5: నగరంలోని తిలక్‌గార్డెన్ పక్కనే మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న వేంకటేశ్వర మొబైల్ షాపులో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి యజమానులు మొబైల్ షాపును మూసివేసి వెళ్లారు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచి చూడగా సెల్‌ఫోన్స్, మిగతా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడానికి గమనించగా షాపు వెనకాల ఉన్న గోడకు పెద్ద కన్నం వేసి దుండగులు లోనికి దూరినట్లు గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. దుండగులు పోలీసులకు ఎలాంటి ఆధారాలు చిక్కకుండా దుకాణంలో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. యజమాని ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు లక్షల విలువజేసే మొబైల్స్ చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఇది లా ఉండగా సీపీ క్యాంపు కార్యాలయానికి కూతవేటు దూరంలోనే చోరీ జరగడం విస్మయానికి గురిచేస్తున్నది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు.. కేసును ఛేదించేందుకు చర్యలు ప్రారంభించినట్లు సమాచారం.

చోరీ జరిగిన దుకాణం ఇదే..

ఎంపీగా పోటీకి అనర్హుడు
ఇంత దుర్మార్గపు వ్యక్తి మరొకరు లేరు
కాషాయం కప్పుకున్న కసాయికి టికెట్ ఇవ్వొద్దు
బీజేపీ కార్పొరేటర్ దంపతుల డిమాండ్
కాషాయ పార్టీలో చర్చనీయాంశంగా మారిన వ్యవహారం
కార్పొరేటర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన బీజేపీ

అహంకారి అర్వింద్..

ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మీసాల శ్రీనివాసరావు, పక్కన కార్పొరేటర్ సవిత

వినాయక్‌నగర్, మార్చి 5: నిజామాబాద్ ఎంపీ, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అర్వింద్ ధర్మపురిపై వ్యతిరేకత వెల్లువెత్తుతున్నది. ప్రజలతో పాటు సొంత పార్టీలోనూ నిరసన సెగ తగులుతున్నది. ఇప్పటికే అర్వింద్‌కు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించాయి. తాజాగా సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్ దంపతులు.. అర్వింద్ తీరుపై దుమ్మెత్తిపోశారు. అహంకారి, దుర్మార్గుడు, కాషాయం కప్పుకున్న కసాయి అర్వింద్.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి అనర్హుడని ధ్వజమెత్తారు. అతడికి టికెట్ ఇచ్చి బీజేపీ తప్పు చేసిందని, అర్వింద్‌ను పోటీ తప్పించాలని ఆ పార్టీ సీనియర్ నేత మీసాల శ్రీనివాసరావు, ఆయన సతీమణి, నిజామాబాద్ 19వ డివిజన్ కార్పొరేటర్ సవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఢిల్లీలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అర్వింద్‌కు టికెట్ ఇవ్వొద్దని రాష్ట్ర పార్టీ నేతలకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, దీంతో నేరుగా అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వచ్చినట్లు చెప్పారు.

దమ్ముంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలి..

అర్వింద్ ఎవరికీ అందుబాటులో ఉండడని, పార్టీ నేతలతో పాటు ప్రజలను సైతం చులకనగా చూస్తాడని విమర్శించారు. నిజామాబాద్‌లోని 17 లక్షల మంది అర్వింద్ బాధితులని, ఓటర్ల కోరిక మేరకు బీజేపీ అభ్యర్థిని మార్చాలని విజ్ఞప్తి చేశారు. అర్వింద్‌కు దమ్ముంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలవాలని సవాల్ చేశారు. ఎంపీకి వ్యతిరేకంగా నిజామాబాద్‌లో ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. పార్లమెంట్‌లో ఇంత టెంపర్ ఉన్న వ్యక్తి మరొకరు లేరని, అలాంటి వ్యక్తికి మరోసారి టికెట్ ఇచ్చి బీజేపీ తప్పు చేసిందన్నారు. ఆయనకు బదులు డేరాబాబా, నిత్యానందకు టికెట్ ఇచ్చినా తాము ఢిల్లీ వరకు వచ్చే వాళ్లం కాదని తెలిపారు. అర్వింద్‌కు టికెట్ ఇవ్వొద్దని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర నాయకత్వం సరైన నుంచి సమాధానం రాకపోవడంతో మీడియా ముందుకు రావాల్సి వచ్చిందన్నారు. మోదీ, అమిత్‌షా సహా జాతీయ నాయకత్వానికి ఫిర్యాదు చేయడానికి ఢిల్లీకి వచ్చామని చెప్పారు. ప్రజల అభిప్రాయాల మేరకు అర్వింద్‌ను మార్చాలని, అతడికే టికెట్ ఇస్తే బీజేపీకి నష్టం జరుగుతుందన్నారు.

బీజేపీ నుంచి సస్పెన్షన్..

అర్వింద్‌కు వ్యతిరేకంగా గళమెత్తిన సీనియర్ నేత శ్రీనివాసరావు, కార్పొరేటర్ సవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి తెలిపారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘించి, పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తుండడంతో సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని, వారం రోజుల్లో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని సూచించారు.